# రాజా పెళ్లి

శ్రీమతి నుసర్ల లక్ష్మీనరసమాంబగారు

రాజా తల్లిదండ్రులకు అల్లారుముద్దుగా పెరిగిన ఆరవబిడ్డ. అసలుపేరు రాజరాజేశ్వరి అయినప్పటికీ ముద్దుపేరు రాజా. రాజాఅని పిలవడం అందరికీ సులభం. అందుకని పిల్లలూ, పెద్దలూ, వృద్ధులూ, అంతాకూడా రాజా అని పిలవడమే వాడుక. ఇప్పుడూ నాళ్ల ఆయనకూడా రాజా అనే పిలుస్తున్నారు లెండి.

రాజాకి 14 ఏళ్ళునిండకుండా అత్తవారింటికి వెళ్లకుండానే భర్తృహీన అయింది. తల్లిదండ్రులకు మితిలేని సంతాపం గలిగించిందీవిషయమే. తండ్రిమాత్రం కొద్దిరోజులకు ధైర్యము తెచ్చుకొని భార్యకు ధైర్యము చెపుతూ వుండేవాడు. తలంపులుండికూడా ఆచరించడానికి ఝుంకుస్తారు, సంఘానికి వెరుస్తారు, వెలికి పెద్దపులిలా భయపడుతారు. అందుకనే యీ ప్రపంచకంలో సుఖానికి తావు తక్కువైపోయింది. చుక్కల్లోచంద్రుడులా రాజా దినదినాభివృద్ధినొందుతూ సౌందర్యంతో ఒప్పుతోంది. చక్కగా కోవెలలాటి కంఠంతో కోమలంగా పాడుతుంది. రాజా పెద్దదయినకొద్దీ తల్లిదండ్రులకు భారం యెక్కువైంది. ఆభారం యింతాఅంతా కాదు. మొయ్యలేనిభారం. రాత్రింపవళ్లు యిదే ఆలోచన. ఏమైనాసరే పెళ్లిచేసి తీరుతాను అన్నారామెతండ్రి. తల్లికి కాస్తధైర్యం గల్గింది. తగిలినచోటే తగులుతుంది. భగవంతుడు అనేకవిధాల ఆడిస్తూ వుంటాడు, నవ్విస్తూ వుంటాడు. రాజావని ఆటలోనే వుంది. రాజాతండ్రి అకస్మాత్తుగా జ్వరంతగిలి మరణించారు. పాపం రాజా శోకసముద్రంలో మునిగిపోయింది.

ముందు తారురోడ్డున తీసికెళ్లి తర్వాత ముళ్ళు తొక్కించటం, ముందుముళ్ళు తొక్కించి తర్వాత పూలమీద నడిపించటం మొదలైన వన్నీ జగన్నాటకసూత్రధారి మాయలు. ఆ అతీతునికి సాధ్యంకానిదేదీ లేదు. కొద్దిరోజులు గడిచాయి. ఏమైనా సరే పెళ్లిచేసి తీరతానన్న భర్తపలుకులు రాజాతల్లికి చెవులల్లో వినిపిస్తున్నాయి. ఆమె భగవంతునిమీద భారంవేసి, తనవాళ్లందరికీ భర్తపలుకులు చెప్పింది. కొన్నాళ్లకి తెంపయింది. కొందరికి యిష్టం, కొందరికి అయిష్టం, కొందరికి యిష్టముండికూడా భయం. ఏట్లాగైనా మూకువంతులు బంధువులంతా యిష్టపడి సంబంధాలు వెతకడం ఆరంభించారు. మనుష్య ప్రయత్నమే కాకుండ దైవయత్నంకూడ వుందికాబట్టి త్వరలోనే ఓ చక్కటిసంబంధం, రాజా కోరుకున్నది, కుదిరింది. శీఘ్రంగానే పెండ్లికూడా అయిపోయింది. ఆహ్వానపత్రికలు పంపినవారూ పంపనివారూ కూడా యీపెళ్లికివచ్చారు. బంధువులంతా సగంమంది వచ్చారు. బెజవాడలో పెళ్లి. మగపెళ్లివారికీ ఆడపెళ్లివారికీ పెళ్లి మధ్య అలకలు ముగ్గులు యేమీలేవు. పెళ్లికూతుర్ని పెళ్లికొడుకు, పెళ్లికొడుకుని పెళ్లికూతురూ కూడా కొనుక్కోలేదు. పెండ్లికిముందు బాల్యవివాహాలలో మొగపెళ్లి



1023

వారొస్తుంటే ఆడపెళ్లివారు యెదురై పానకం కావిళ్లతో యెదురుసన్నాహం అంటూ చేస్తారు. ఇప్పుడో తల్లక్రిందులైంది. ఆడపెళ్లివారికంటె ముందుగావచ్చి సిద్ధంగా వున్నారు మగపెళ్లివారు. ఆడపెళ్లివారువచ్చే వేళకు సరిగా రైల్వేస్టేషనుకివెళ్లి కాఫీతో సహా యెదురుసన్నాహం చేశారు. పెళ్లి చాలా సరదాగా అయింది. అప్పాల్లో గొప్ప వాళ్లు కొంతమంది వచ్చారు. పొరుగూరు నుంచి రానివాళ్ళు రానందుకు విచారిస్తూ ఆశీర్వాదాలు టెలిగ్రామ్‌ద్వారా పంపేరు. ఆ సందర్భంలోనే శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీ బాయమ్మగారు యీక్రిందవ్రాసిన పద్యములు ఆశీస్సు వ్రాసిపంపి ప్రేమను తెలియపరిచారు.

### ఆశీస్సు

ఏ విభుని దివ్యమధుర కృపావలోక
నాసుధావృష్టి నార్ద్రమై యమలమైన
స్వేచ్ఛ నానందమయమైన జీవితంబు
సాధ్యమో, యదిమీకు ప్రసాదమగుత!
గుణము శీలమునే గోరికొని స్వయంవ
రమ్ము నందినవారు పరస్పరమ్ము
వడయు పావనభూతలస్వర్గసుఖము
ననుభవించి ముదాబ్ధి విహారులగుడు!!
సాధుగుణకీర్తి శ్రీజగన్నాథమూర్తి
రాజరాజేశ్వరీప్రేమరత్న రుచిర
మోహన కృపార్ద్రములు జూపు
ముత్తియములు
సేసప్రాలయి గూర్మి ఆశీస్సు లిడుత!!!

సరే పెళ్ళి గమ్మునై పోయింది. పెళ్ళికూతురూ పెళ్ళికొడుకూ చక్కగా చిలకా గోరువంకల్లా చక్కాబోయారు.

వూళ్ళోవెలి. వెలంటే యెట్లాటిది? వీరింటి కెవ్వరూ భోజనాలకు రారట. "పోనీయండి రాకపోతే, మాకేం లోటులేదు, మేమే మిమ్మల్ని వెలివేశాం, మాబంధువులంతా వచ్చి పెళ్ళిచేశారు, వాళ్లంతా మాయింటి కొస్తారు, మీరువస్తేరండి యిష్టంలేకపోతే మానండి. మాయిష్టంమాది" అన్నారు. వూళ్ళో కలకలంగావుంది. కొంతమంది యిదేం తప్పులేదన్నారు. మనసంఘంలో జరిగే ఘోరకృత్యాలు చూడలేకుండా వున్నాము, అంతకన్న వేయిరెట్లు యిదే నయం అన్నారు కొందరు. శాస్త్రం వప్పదన్నారు నిష్ఠాగరిష్ఠులు. మేం చచ్చాక మాఅబ్బాయిలు యిటువంటివాటికి వెడతారేమోకాని మేం బ్రతికివుండగా మావాళ్లెడితే మాకూ వాళ్ళకీ కూడా బలవంతమరణమే అన్నారు, పట్టుదలగలవారు. ఓ యిలా లక్షమాదిర్లుగా అంటున్నారు. వీరంతా తమబిడ్డలకు రజస్వలానంతర వివాహాలు చేయవలసినవారే. ఇంతలో వీళ్ళను వెలేస్తారట, తర్వాత వాళ్ళు కూడా వెలై పోతారన్నమాట. ఓరోజు రాజా పుట్టింట్లో చిన్నసంతర్పణ—సత్యనారాయణవ్రతం వెంకటేశ్వర దీపారాధన. ఇష్టమైనవాళ్ళంతా పోగయ్యారు. పట్టండంటే పట్టండన్నారు. వాళ్ళింటికి భోజనాలకెళ్లేరు. అంతా కలిశారు. మమ్మల్నేమీ పట్టుకోలేదే అన్నారు, అరుగుమీద కూర్చుని గుసగుసలాడుకుంటూవున్న అహితాగ్నిపరుల దగ్గర కెళ్ళి.

1024